మొదటి ప్రకరణం

# తౌహీదె రుబూబియత్ భావం. బహుదైవారాధకులు సహితం దీనిని అంగీకరించారు

## తౌహీద్ (దేవుని ఏకత్వం) :

తౌహీద్ అంటే భావం అల్లాహ్‌ను ప్రభువుగా, పోషకునిగా, సూత్రధారిగా అంగీకరించాలి. ఈ వ్యవహారంలో ఆయన్ని అద్వితీయునిగా నమ్మాలి. ఆరాధనలను, ఉపాసనలను ఆయనకే ప్రత్యేకించుకోవాలి. ఆయన నామాలను, గుణగణాలను (లక్షణాలను) ఆయన కొరకు నిరూపించాలి. ఈ విధంగా తౌహీద్ మూడు రకాలుగా ఉంటుంది.

**ఎ) తౌహీద్ రుబూబియత్**

**బి) తౌహీదె ఉలూహియత్**

**సి) తౌహీదె అస్మా వ సిఫాత్**

వీటిలో ప్రతి ఒక్క దానికీ ఓ ప్రత్యేక భావార్థం ఉంది. వీటిని విడమరచి చెప్పటం చాలా అవసరం. అప్పుడే వీటి మధ్య గల స్పష్టమైన వ్యత్యాసం అవగతమవుతుంది.

## తౌహీదె రుబూబియత్ నిర్వచనం

విశ్వ సృష్టి, దాని నిర్వహణలో అల్లాహ్‌ను ఒకే ఒక్కడుగా, సాటిలేనివానిగా విశ్వసించటం. సమస్త సృష్టిరాశులను సృష్టించినవాడు ఆయన ఒక్కడేనని నిర్ద్వంద్వంగా నమ్మటం తౌహీదె రుబూబియత్ అనబడుతుంది.

ఉదాహరణకు : విశ్వప్రభువు ఇలా సెలవిచ్చాడు :

﴿اللَّهُ خَالِقُ كُلِّ شَيْءٍ﴾ (الزمر:٦٢)

**“అన్ని వస్తువులనూ సృష్టించినవాడు అల్లాహ్‌యే.”(అజ్‌జుమర్: 62)**

మనుషులకూ, జంతుజాలానికి ఆహారాన్ని ప్రసాదించేవాడు అల్లాహ్‌యే.

﴿وَمَا مِن دَابَّةٍ فِي الْأَرْضِ إِلَّا عَلَى اللَّهِ رِزْقُهَا﴾ (هود:٦)

**“భూమిపై సంచరించే ప్రాణులన్నింటికీ ఆహారాన్ని (జీవనోపాధిని) సమకూర్చే బాధ్యత అల్లాహ్‌దే.” (హూద్ : 6)**

https://teluguislam.net

దీంతోపాటు సమస్త లోకాలకు అధిపతి అల్లాహ్‌యేనని, యావత్ జగతిలోని వ్యవహారాలన్నింటికీ ఆయనే నిర్వహణకర్త అనీ, రాజ్యాధికారాన్ని ప్రసాదించేవాడు, అధికారాన్ని లాక్కొనేవాడు కూడా ఆయనేనని గౌరవాన్ని ప్రసాదించేవాడు, పరాభవం పాల్జేసేవాడు కూడా ఆయనేనని, ఆయన సర్వ సమర్థుడని, ఆయనే జీవన్మరణాల ప్రదాత అని కూడా మనం విశ్వసించాలి.

﴿قُلِ اللَّهُمَّ مَالِكَ الْمُلْكِ تُؤْتِي الْمُلْكَ مَن تَشَاءُ وَتَنزِعُ الْمُلْكَ مِمَّن تَشَاءُ وَتُعِزُّ مَن تَشَاءُ وَتُذِلُّ مَن تَشَاءُ بِيَدِكَ الْخَيْرُ إِنَّكَ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ☆ تُولِجُ اللَّيْلَ فِي النَّهَارِ وَتُولِجُ النَّهَارَ فِي اللَّيْلِ وَتُخْرِجُ الْحَيَّ مِنَ الْمَيِّتِ وَتُخْرِجُ الْمَيِّتَ مِنَ الْحَيِّ وَتَرْزُقُ مَن تَشَاءُ بِغَيْرِ حِسَابٍ﴾ (آل عمران:٢٦،٢٧)

**(ఓ ముహమ్మద్!) ఈ విధంగా పలుకు: "ఓ అల్లాహ్! విశ్వ రాజ్యాధి పతీ! నీవు కోరిన వారికి రాజ్యాధికారం ఇస్తావు. నీవు కోరినవారి నుండి రాజ్యాన్ని లాక్కుంటావు. నీవు కోరిన వారికి గౌరవమొసగు తావు. నీవు కోరినవారిని పరాభవానికి గురిచేస్తావు. సమస్త మేళ్లూ నీ చేతిలోనే ఉన్నాయి. నిశ్చయంగా నీవు ప్రతి వస్తువుపైన అధికారం కలవాడవు. నువ్వే రాత్రిని పగటిలోనికి ప్రవేశింపజేస్తావు. నువ్వే పగటిని రాత్రిలోనికి జొప్పిస్తావు. నువ్వే నిర్జీవమైన వాటి నుండి జీవమున్న వాటిని తీస్తున్నావు. నువ్వే జీవమున్న వాటి నుండి నిర్జీవమైన వాటిని వెలికి తీస్తున్నావు. ఇంకా నీవు కోరినవారికి లెక్కలేనంత ఉపాధిని ఇస్తావు." (ఆలి ఇమ్రాన్ : 26, 27)**

విశ్వ సామ్రాజ్యాధికారంలో, ఆయన ప్రభుత్వ నిర్వహణలో వేరొకరిని భాగస్వామిగా, సహాయకునిగా కల్పించటాన్ని పరమ పవిత్రుడైన అల్లాహ్ త్రోసిపుచ్చాడు. సృష్టించటంలో, ఉపాధిని సమకూర్చటంలో తనకు సాటి కల్పించటాన్ని కూడా ఆయన ఖండించాడు. ఈ విధంగా సెలవీయబడింది :

﴿هَٰذَا خَلْقُ اللَّهِ فَأَرُونِي مَاذَا خَلَقَ الَّذِينَ مِن دُونِهِ﴾ (لقمان:١١)

**"ఇదీ అల్లాహ్ సృష్టి! ఇప్పుడు ఆయన తప్ప వేరితరులు ఏం సృష్టించారో మీరు నాకు చూపించండి." (లుఖ్మాన్ : 11)**

ఈ విధంగా కూడా సెలవీయబడింది :

﴿أَمَّنْ هَٰذَا الَّذِي يَرْزُقُكُمْ إِنْ أَمْسَكَ رِزْقَهُ﴾ (الملك:٢١)

**"ఒకవేళ ఆయన గనక తన ఉపాధిని నిలిపివేస్తే, మరి మీకు ఉపాధిని**

**ఇచ్చేవాడెవడో చెప్పండి!?" (అల్ ముల్క్ : 21)**

ఈ విధంగా అల్లాహ్ పోషకత్వంలో, నిర్వహణలో, పరిపాలనలో సమస్త జీవరాశు లపై తనకు గల తిరుగులేని అధికారాన్ని చాటిచెబుతున్నాడు. అందుకే ఇలా సెలవిచ్చాడు:

﴿اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ﴾ (الفاتحة:١)

**"ప్రశంసలు, పొగడ్తలన్నీ అల్లాహ్‌కు మాత్రమే శోభిస్తాయి. ఆయన సమస్త లోకాలకు పోషకుడు." (అల్ ఫాతిహా : 1)**

వేరొకచోట ఈ విధంగా ఉపదేశించబడింది :

﴿إِنَّ رَبَّكُمُ اللّٰهُ الَّذِيْ خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ فِيْ سِتَّةِ أَيَّامٍ ثُمَّ اسْتَوٰى عَلَى الْعَرْشِ يُغْشِي اللَّيْلَ النَّهَارَ يَطْلُبُهُ حَثِيْثًا وَالشَّمْسَ وَالْقَمَرَ وَالنُّجُوْمَ مُسَخَّرَاتٍ بِأَمْرِهِ أَلَا لَهُ الْخَلْقُ وَالْأَمْرُ تَبَارَكَ اللّٰهُ رَبُّ الْعَالَمِيْنَ﴾ (الاعراف:٥٤)

**"నిస్సందేహంగా అల్లాహ్‌యే మీ ప్రభువు. ఆయన ఆకాశాలను, భూమిని ఆరు రోజులలో సృష్టించాడు. ఆ తరువాత సింహాసనం (అర్ష్)పై ఆసీనుడయ్యాడు. ఆయన రాత్రిని పగటిపై కప్పివేస్తాడు. అది దానిని వెంబడిస్తూ వేగంగా వస్తుంది. ఇంకా - ఆయన సూర్యచంద్రులను, నక్షత్రాలను తన ఆజ్ఞకు కట్టుబడి ఉండేవిధంగా సృష్టించాడు. వినండి! సృష్టి ప్రక్రియ ఆయన స్వంతం. ఆజ్ఞాపన ఆయన సొత్తు. సకల లోకాల ప్రభువైన అల్లాహ్ అపారమైన శుభాలు కలవాడు." (అల్ ఆరాఫ్ : 54)**

అల్లాహ్ సమస్త ప్రాణుల నైజంలో తమ ప్రభువు యొక్క పాలనను, పోషణను అంగీకరించే గుణాన్ని పొందుపరిచాడు. ఆఖరికి ఆరాధనలో అల్లాహ్‌కు భాగస్వాముల్ని కల్పించే ముష్రిక్కులు సయితం అల్లాహ్ పోషణాధికారాన్ని అంగీకరించేవారు. ఈ విషయంలో అల్లాహ్ అద్వితీయుడని ఒప్పుకునేవారు. ఉదాహరణకు : ఈ క్రింది సూక్తులలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు :

﴿قُلْ مَنْ رَّبُّ السَّمَاوَاتِ السَّبْعِ وَرَبُّ الْعَرْشِ الْعَظِيْمِ ☆ سَيَقُوْلُوْنَ لِلّٰهِ قُلْ أَفَلَا تَتَّقُوْنَ ☆ قُلْ مَنْ بِيَدِهِ مَلَكُوْتُ كُلِّ شَيْءٍ وَّهُوَ يُجِيْرُ وَلَا يُجَارُ عَلَيْهِ إِنْ كُنْتُمْ تَعْلَمُوْنَ ☆ سَيَقُوْلُوْنَ لِلّٰهِ قُلْ فَأَنّٰى تُسْحَرُوْنَ﴾ (المؤمنون:٨٦،٨٩)

**సప్తాకాశాలకు, మహోన్నతమయిన పీఠము (అర్ష్)నకు అధిపతి ఎవరు?" అని వారిని అడుగు. 'అల్లాహ్‌యే' అని వారు సమాధాన మిస్తారు. "మరలాంటప్పుడు మీరెందుకు భయపడరు?" అని వారిని**

**(నిలదీసి) అడుగు. సమస్త విషయాల సార్వభౌమత్వం ఎవరి చేతుల్లో ఉందో, శరణు ఇచ్చేవాడెవడో, ఎవరికి వ్యతిరేకంగా ఏ శరణూ లభించదో – ఆయనెవరో మీకు తెలిసి ఉంటే చెప్పండి? అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు. 'అల్లాహ్‌యే కదా!?' అని వారంటారు. "మరైతే మీరు ఎటువైపు నుండి మంత్రించబడుతున్నారు?" అని వారిని ప్రశ్నించు. (అల్ మోమినూన్ : 86 – 89)**

ఆదం సంతతిలోని ఏ ప్రముఖ వర్గం కూడా ఈ రకమయిన తౌహీద్‌ను (ఏకత్వాన్ని) కాదనలేదు. పైగా ఈ రకమయిన ఏకత్వాన్ని అంగీకరించే గుణం వారి అంతరాళాన్ని పెనవేసుకుని ఉంది. ఉదాహరణకు : ఈ సందర్భంగా దైవప్రవక్తలు చెప్పిన దానిని ఉదాహరిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

﴿قَالَتْ رُسُلُهُمْ أَفِى ٱللَّهِ شَكٌّ فَاطِرِ ٱلسَّمَاوَاتِ وَٱلْأَرْضِ﴾ (ابراهيم:١٠)

**"ఏమిటి, భూమ్యాకాశాల నిర్మాత అయిన అల్లాహ్‌పైనే మీకు అనుమానం ఉందా?" అని వారి ప్రవక్తలు వారితో అన్నారు.**

**(ఇబ్రాహీమ్ : 10)**

ప్రపంచ చరిత్రలో విశ్వప్రభువు ఉనికిని తిరస్కరించిన సుప్రసిద్ధ వ్యక్తులలో అగ్రగణ్యుడు ఫిర్ఔన్. కాని వాడు సయితం తన హృదయాంతరాళాల్లో అల్లాహ్ యందు నమ్మకం కలిగి ఉండేవాడు. ఉదాహరణకు దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) అతనితో చెప్పినట్లు –

﴿لَقَدْ عَلِمْتَ مَا أَنزَلَ هَٰؤُلَاءِ إِلَّا رَبُّ ٱلسَّمَاوَاتِ وَٱلْأَرْضِ بَصَائِرَ﴾ (الاسراء:١٠٢)

**"(ఓ ఫిర్ఔన్!) గుణపాఠంతో కూడుకున్న ఈ సూచనలను భూమ్యాకాశాల ప్రభువు తప్ప మరొకరెవరూ అవతరింపజేయలేదన్న విషయం నీకూ తెలుసు." (బనీ ఇస్రాయీల్ : 102)**

ఫిర్ఔన్ గురించీ, అతని జాతి వారి గురించి విశ్వ ప్రభువు ఏమన్నాడో చూడండి:

﴿وَجَحَدُوا بِهَا وَاسْتَيْقَنَتْهَا أَنفُسُهُمْ ظُلْمًا وَعُلُوًّا﴾ (النمل:١٤)

**"నిజానికి వారి మనసులు (సత్యాన్ని) నమ్మినప్పటికీ అన్యాయం, అహంకారంతో వారు దానిని త్రోసిపుచ్చారు." (అన్ నమ్ల్ : 14)**

నేటి నాస్తికులు, కమ్యూనిస్టుల వ్యవహారమూ ఇలాంటిదే. తమ అహం కోసం వారు పైకి దేవుని ఉనికిని త్రోసిపుచ్చినప్పటికీ వారి అంతరంగంలో దైవభావన పాతుకుని ఉంది. కానవచ్చే ప్రతి వస్తువు వెనుక ఓ కర్త ఉన్నాడని, ప్రతి ప్రాణినీ సృష్టించిన సృష్టికర్త ఉన్నాడని, ప్రతి ప్రభావపూరితమైన దాని వెనుక ప్రభావం వేసే వాడొకడు

ఉండటం అనివార్యం అన్న సంగతిని వారూ ఒప్పుకుంటారు. ఈ నేపథ్యంలో దేవుడేమంటున్నాడో చూడండి –

﴿أَمْ خُلِقُوا مِنْ غَيْرِ شَيْءٍ أَمْ هُمُ الْخَالِقُونَ ☆ أَمْ خَلَقُوا السَّمَاوَاتِ وَالْأَرْضَ بَل لَّا يُوقِنُونَ﴾ (الطّور:٣٥،٣٦)

**"ఏమిటీ, వీరు (పుట్టించేవాడు) ఎవరూ లేకుండానే వారంతట వారే పుట్టుకువచ్చారా? లేక వారే స్వయంగా సృష్టికర్తలా? ఏమిటి, భూమ్యాకాశాలను వాళ్ళే సృష్టించారా? అసలు వాళ్లు నమ్మేరకం కాదు." (అత్ తూర్ : 35, 36)**

ఊర్ధ్వలోకం, పాతాళ లోకంలోని ఒక్కొక్క భాగంపై పరిశీలన చేసినపుడు బోధపడే దేమిటంటే ఈ విశ్వమండలంలోని ఒక్కొక్క రేణువు తనను సృష్టించిన స్వామి ఉనికిని గురించి సాక్ష్యమిస్తోంది. కనుక హేతువు పరంగానూ, స్వాభావికంగానూ సృష్టికర్తను నిరాకరించటమంటే విజ్ఞానాన్ని నిరాకరించటమే. ఆ రెండింటి మధ్య ఎలాంటి వ్యత్యాసం లేదు (ఎందుకంటే నిజ జ్ఞానం సృష్టికర్త ఉనికిని సత్యమని ధ్రువీకరిస్తుంది). నేడు కమ్యూనిజం ప్రభువు ఉనికిని నిరాకరిస్తుందంటే అది కేవలం అహంకారంతో చేసే నిరాకరణే. తన ఇగో కోసం నిజమైన భావాలు భావనలపై తనంతట తానుగా విధించుకున్న ఆంక్షల ఫలితమే ఇది. ఎవరయినా సత్యాన్ని కాదనటంలో ఈ స్థితికి చేరాడంటే అతను తన బుద్ధిని విస్మరించాడన్నమాట! తనను ఆటపట్టించే అవకాశం జనులకు కల్పించాడన్న మాట!!